# 1. మేషపూర్ణిమా ధ్యానము

ఈ పూర్ణిమా సన్నివేశము మేషమాసమందు సంభవించును. మేషరాశి సంకేతచిత్రము ఒక గొఱ్ఱెతల. శాశ్వత దివ్యతత్త్వము పరిమిత భౌతిక తత్త్వమును సూటిగా ఢీకొని, కాలచక్రములుగా రూపొందుటను అది సూచించుచున్నది. ఆకాశమునగల తారకావ్యూహము రెండు గొఱ్ఱెకొమ్ములుగా మనకు దర్శనమిచ్చుచు, ఆ సంకేతచిత్రమును సూచించు చున్నది. వలయాకారముగా మెలితిరిగి యున్న ఆ రెండు కొమ్ముల సంకేతము మన సంవత్సరకాలములోని ఉత్తరాయణ, దక్షిణాయనములను స్ఫురింప జేయుచున్నది. ఆ రెండు అర్ధభాగములు పరస్పర పూరణార్థములుగా వర్తించును. వలయాకారముగా వంపుతిరిగిన మన కనుబొమ్మలు, నాసికాగ్రమునగల ఒకబిందువు వద్ద పరస్పరము తాకుచున్నట్లు ఆ సంకేతము మనకు దర్శనీయమగుచున్నది. దానిపై ధ్యానమును నిలుపుము. నీ మనస్సుగా కాలము నీలోనికి ప్రవేశించుటను అది సూచించును. మనస్సు ప్రజ్ఞామయము. అదియొక చైతన్యస్వరూపము మాత్రమే. మనలోని మెలకువగా అది కొలతకు అందును. మేషసంక్రమణ వేళ సూర్యుడు భూమధ్యరేఖను ఖండించి దక్షిణమునుండి, ఉత్తరము వైపునకు తన ప్రయాణదిశను మార్పు చేసినట్లు కనుపించును. సంవత్సర స్వరూపుడైన యజ్ఞపురుషుని శిరస్సును ఖండించి, దానిస్థానమున గొఱ్ఱెతలను అతికినట్లు వేదములు, పురాణములు వర్ణించు చున్నవి. అంతటితో సంవత్సరాత్మకమైన యజ్ఞము పరిసమాప్తమై ఒక మండలాకృతి పూర్ణస్వరూపము ధరించినదని మనకు అవగత మగుచున్నది. ఈ పృథ్వీతలముపై విభిన్న ప్రాణికోటి సంవత్సర కాలపురుషుని దేహమందు ఒక సృష్టిగా మేల్కాంచినది. కంటికి కనబడని అగ్నిని మనము "గూఢాగ్ని" అని పిలిచెదము. అది అనంతమైన ఆకాశముగా రూపధారణ

చేయుచున్నది. కంటికి కన్పడుచున్న అగ్నిని "తేజో౽గ్ని" అని అందుము. అది సౌరదేవుడుగా సాక్షాత్కరించు చున్నది. మేషసంక్రమణ శుభారంభవేళ ఆ సౌరదేవుని తేజోవైభవము ఋతు భ్రమణములుగా మనకు వ్యక్తమగుచున్నది. ఆ రాశిద్వారమున పూర్ణచంద్ర కళావిన్యాసము ఆవిష్కరణ నొందునపుడు మన ధ్యానమున మేషరాశిపై న్యాస మొనర్పవలెను. అట్లొనర్చినచో తేజోవంతమైన నీ వెలుగు నీకు అనుభవమునకు వచ్చును. మేషపూర్ణిమా ధ్యానము జరుగునపుడు సంవత్సర స్వరూపుడైన పరమేశ్వరుడు బృందావన ప్రజ్ఞగా మన అందరి యందు స్థిరమగుగాక.